# అనుబంధాలు

వేదవతీదేవి

'ఆడపిల'
'ఆడపిల్లే!...'
'ఆడపిల్లా?...'
ఆలపిల్లా!...'

పుట్టి భూమిమీద పడుతూనే నేను అందుకున్న స్వాగత వాక్యాలు ఇవిట. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతూ ఉండగా, ముఖం ఎవరికీ కనిపించకుండా అటువేపు తిప్పుకు కూర్చున్నాను.

పదమూడు సంవత్సరాలనాటి మాట ఎందుకో వచ్చి అమ్మ ఆనాటి కథలు చెపుతూ ఉన్నది.

అత్తారింట్లోవున్న పెద్దక్క మినహాయించి పట్నంలో చదువుకుంటున్న అన్నయ్య మినహాయించి—అక్కడ చిన్నక్కా, నేనూ, పక్కింటి పిన్నిగారూ ఉన్నాము.

అమ్మ అయితే పురిట్లో పసికందును ఒక రోజంతా ముఖమేనా చూడకుండా అటు వేపు తిరిగి పడుకున్నదట! తనతో ఆడుకుందుకు మరొక మగపిల్లవాడు కాకుండా పనికిమాలిన ఆడపిల్లను కలిగినందుకు అన్నయ్యకు కోపంట! నేను మగపిల్లవాణ్ణి అయిఉంటే కలిగే లాభాలూ, ఆడపిల్లనయినందువల్ల కలిగిన నష్టాలూ ఆట్టే తెలియకపోయినా, నాలుగేళ్ల చిన్నక్కకూడా 'ఆలపిల్లా...'అంటూ అందరితోపాటు తన అసంతృప్తిని కూడా వెలిబుచ్చి ఊరుకుందిట!

పదిహేనేళ్ళ ఆడపిల్లల ఉబలాటంతో, ఉత్సాహంతో నన్ను చేతుల్లోకి తీసుకుని ఆడించి, లాలించి నేను ఆడపిల్లనైనందుకు తిట్టకుండా మురిసిపడింది పెద్దక్క.

నాకు నాలుగేళ్లు వచ్చేవరకూ, తాను కాపరానికి వెళ్ళేవరకూ, నన్ను ఆడించినా, నీళ్ళుపోసినా, అన్నం తినిపించినా, అన్నిటికీ తానే అయి ఉబలాటంతో నా సంరక్షణ చేసేదిట...అందుకే నేమో నాకు పెద్దక్కపైన భయభక్తులూ గౌరవమూ మెండు.

నా పసితనంలోని నే నెరుగని ఈ ముచ్చటలు అమ్మ చెప్పతుండగా విని నాలో చిత్రమైన భావాలు చెలరేగాయి. గుండెలో చెప్పలేని సంక్షోభం అలుముకుంటుండగా పెదవి కొరుక్కుంటూ కూర్చున్నాను.

ఇందుకే కాబోలు చిన్నక్క అస్తమానూ నాతో పోట్లాడుతుంది. అన్నయ్య నాతో మాట్లాడటమే తన హోదాకి లోపమన్నట్లుగా అదో మోస్తరుగా ఉంటాడు. అమ్మ సరేసరి, చిన్నక్క చేయనన్న పనులన్నీ నాకే చెప్పజెపుతుంది. ఆమెకు అసలే ఇష్టంలేదుగా నేను ఆడపిల్లనై పుట్టటం!

మంచంమీద కూర్చుని మహాప్రజ్ఞావంతురాలిని నేనే నన్నట్లు పేపరు పేజీలు తిరగవేసే చిన్నక్కని చూచేసరికి నాకు ఈర్ష్య ముంచుకు వచ్చింది. కళ్ళనిండా నిండుకు పోయిన కన్నీళ్ళను ఎవరూ చూడకుండా కొనగోటితో చిమ్మివేసి అన్నాను.

'చిన్నక్క పుట్టినప్పుడుకూడా అందరికీ ఇట్లాగే కోపం వచ్చిందా అమ్మా?'

ఊహూ, రాలేదుట! అన్నయ్య తరవాత చాలా సంవత్సరాలకు పుట్టటం వలనా, రెండవ ఆడపిల్లే అయినందువలనా సంతోషపడి— పైపెచ్చు చాలా గారాబంగా పెంచేరుట! కాగా, తాను ఆడింది ఆటా, పాడింది పాటాగా— ఆ నాటినుంచి ఈ నాటి వరకూ చెల్లించుకుంటూఉంది చిన్నక్క.

పేపరులోంచి ముసిముసిగా నవ్వుకొంటు చిన్నక్క తలపైకెత్తి నావంక చూచింది. తానక్కడికి ఏదో ఘనతవహించినట్లు! ఈ సారి నాకు కళ్ళలో నీళ్ళు తిరగటంతో పాటు వళ్ళుకూడా మండుకొచ్చింది.

అవును. అంత గారాబంగా పెంచబట్టే చిన్నక్కకు మకురుతనం అబ్బింది. ఏపనీ చేయదుకద! తను కావాలన్న వస్తువుకానీ, చీరలేకానీ, ఎంత ఇబ్బందిపడిఅయినా కొని తీరవలసిందే. పైగా, ఆమెకు జగడంపైన మక్కువ యెక్కువ. నాకలం తీశావనీ, నా పుస్తకాలు ఎందుకు సర్దావనీ గిల్లికజ్జాలు పెట్టుకుంటుంది.

నోరుపెట్టుకు జయించే ఈ చిన్నక్క ముందు నే నెంత? బ్రహ్మాస్త్రంముందు పిచ్చుకవంటి దాననంటే సామ్యం బాగుంటుందేమో! ఈ మెత్తని స్వభావం నాకు ఆట్టే లాభాలు తెచ్చిపెట్టలేకపోయినా, చిన్నక్కముందు నన్ను దద్దమ్మను మాత్రం చేసి ఊరుకుంది.

నా స్వభావం మృదువైనదే కావచ్చును. కాని నేను ఆ యింట్లోకి అవాంఛనీయంగా వచ్చానన్న సత్యం తెలిసినప్పుడు—నా హృదయం ఒక విధమైన రోషంతో— అది ఉడుకుమోతుతనమే కానివ్వండి— కోపావేశమే కానివ్వండి— జలజలా పొంగిపొరలిన మాట మాత్రం నిజం. పైగా చిన్నక్క ఒలకపోస్తున్న చిరునవ్వులు నా కోపాగ్నికి ఆజ్యమే అయినాయి.

'నేను పుట్టడం అయితే ఎవరికీ ఇష్టం లేదన్నమాట! అందుకే నేనంటే అందరికీ ఇంత కోపం!'...నాకు తెలియకుండానే మాటలు ఉద్రేకంతో వచ్చాయి.

అమ్మ పకాలున నవ్వింది. కోపావేశం ప్రస్ఫుటంగా నా ముఖంలో కనిపించింది కాబోలును.

'అలా కందగడ్డ అయినావేమే, మగపిల్లవాడు కలగలేదని ఒకటి రెండు రోజులు నిరాశపడామే అనుకో, అంతమాత్రంచేత ఎప్పుడూ ని మీద కోపంగా, కసిగా ఉంటామా! ఏమి నిరాశపడ్డా, ఆ ఒకటి రెండురోజులే, మళ్లా మూడవ రోజునుంచీ బిడ్డమీద సహజమైన మమకారం ఎక్కడకు పోతుంది? ఎక్కడ క్రిందనడిస్తే అరిగిపోతావో, కందిపోతావో అంటూ పెంచాం' అన్నది.

కాని అమ్మచెప్పిన ఈ మాటలు నన్ను అలరించలేదు క్రిందనడిస్తే కందిపోతావన్నట్లు నన్ను పెంచితే అమ్మ నాకు పనులెందుకు చెపుతుంది? అది చిన్నక్కకన్న నన్ను చిన్నచూపు చూడటం కాదా? పెద్దక్క ముందు పుట్టినపిల్ల అనీ, అన్నయ్య మగపిల్లవాడనీ, చిన్నక్క చాలా రోజులకు పుట్టిన రెండవ ఆడపిల్ల అనీ—వాళ్లమీద



ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు,
మెసర్సు సీతారామ్ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.

ఉన్న ప్రేమా, వాత్సల్యమూ—అక్కర లేని ఆడపిల్లను నా పైన ఎట్లా ఉంటాయి?.. నా ఆలోచన ఈ రీతిగా తీగవలె సాగింది.

పెద్దక్క తరవాత నా పైన కోపం లేనిది ఒక్క నాన్నగారికే. ఆయన వేదాంతి. నేను పుట్టినప్పుడు అందరికీ మల్లే ఆయన నన్ను నిరసించనూలేదు ఆతర్వాత ఆయన నన్ను ఏనాడూ కసురుకోనూ లేదు.

ఈభావం అతిక్రమమైనదో కాదో నాకు తెలియదు కాని-నాలో గాఢంగా నాటుకు పోవటానికి ఎక్కువకాలం పట్టలేదు. పరిపక్వత పొందని పసరుపిందెకు తీయదనం లేకపోయినా వగరుతనం ఎందుకు కలగాలి? వయసుదోషం కూడా ఇంచుమించు అటు వంటిదే. ఇది క్రమమైనదనీ ఇది ఉచితమనీ పదమూడేళ్ల ప్రాయంలో ఉన్న నాకు తెలియనిమాట నిజం. అందరిపైనా తెచ్చి పెట్టుకున్న ఈ నిరసనభావం బహుశా పసరుకాయలోని వగరుతనం వంటిదే కావచ్చును.

నాకు అమ్మపైన కోపంవచ్చింది. చిన్నక్క పైన ఈసుకలిగింది. కళ్ళు ఇంతింతలు చేసు కుని నా పైన మావాళ్లకు ఉన్న అసంతృప్తిని సంతృప్తిగా వింటున్న పక్కింటి పిన్నిగారి పైన కోపం తారాజువ్వలా వచ్చింది. వీటన్నిటిమధ్యా హృదయంలో ఏదో మూల లోంచి దుఃఖం గుబగుబలాడుతూ ముంచుకు వచ్చింది. అమ్మముందు ముఖ్యంగా చిన్నక్కముందు పక్కింటి పిన్నిగారి ముందు నా బేలతనం బయటపడటం ఇష్టం లేక ఒక్క విసురున అక్కడనుంచి లేచి ఇవతలకు వచ్చిపడ్డాను.


రాగ విరాగాలతో ఒక విచిత్ర భావా వేగంతో నాహృదయం ఊగి పోయింది. నేను ఈఇంట్లో అందరూ ఒకటి నేనొక్క ర్తినీ ఒకటి.

నా భావానికి అనుగుణంగా నాప్రవర్తన కూడ క్రమంగా మారింది. నన్ను నేను వెలి వేసుకున్నట్లు ఒక నిర్ణీతపరిధిలోకి దాచు కున్నాను. నా చుట్టూ నేను గీచుకున్న గీటు రాయి లోపలకు ఎవరూ చొరలేకపోయి నారు. ఈ సంకుచిత పరిధిని దాటి నేనూ బయటకు తొంగి చూడలేకపోయినాను.

*　　　*　　　*

కానీ, ఎట్టి కావేషము కానీ, కాలగతిని అధిగమించగల శక్తివంతము కాదని నాకు ఆ తర్వాత కొంతకాలానికి గాని తెలిసిరాలేదు. నా దృష్టిలో ఇంట్లో ఉన్న శత్రువు లందరి మధ్యా నన్ను నేను సంరక్షించుకోవలసిన ఆవశ్యకత నాకు ఎక్కువకాలం ఉండలేదు.

మరొక ఏడాదికి చిన్నక్క వివాహమై వెళ్ళిపోయింది. ఆమె వెళుతూ ఉన్నప్పుడైతే, నాప్రత్యర్థి ఎవరో రంగంమీదనుంచి తప్పుకుపోయినట్లు మనసు తేలిక పడింది.



# ★ అనుబంధాలు ★

కాని చిత్రం. ఇంతవరకూ కళ్ళెంలేని గుర్రంలా పరుగుతీసిన నామనస్సు ఒక్కసారి స్తంభించినట్లు స్తబ్ధమై నిలచింది!

ఆమె వెళ్ళిన కొద్దిరోజులకే, ఆమె లేని ఇల్లు చిన్నబోయినట్లు ఏదో వెలితిగా తోచసాగింది. అది సాహచర్య దోషమేనేమో తెలియదు కాని, ఒకసారి నేను అతిగా నిరసించిన ఆమె కసుర్లూ, విసుర్లూ - లేకపోవటంకూడ ఒక లోపంగానే కనిపించసాగింది. సాయంసమయపు పశ్చిమాకాశంలా నా మనస్సు ఇన్ని రకాలుగా మారటం నాకే ఆశ్చర్యం వేసింది.

ఇకపోతే, ఇంకా పట్నంలో చదువుతో కుస్తీపడుతున్న అన్నయ్య మినహాయించి అమ్మా, నేనూ ఒకరికొకరు మిగిలిపోయాము. తత్ఫలితంగా రోజురోజుకూ మేమిద్దరమూ ఒకరికొకరమూ అత్యంత సన్నిహితులమూ, స్నేహితులమూ అయినాము.

ఇప్పటి నామనఃస్థితి ప్రకారం ఆలోచిస్తే ఏ తల్లికైనా అంతరంగికులము కావాలని ఉంటే, ఆ తల్లికి కడసారి ఆడపిల్ల అయి పుట్టడం కన్నా గత్యంతరంలేదు! దూరాన ఉన్న అక్కయ్యలను నాలో చూచి సంతృప్తిపడేది అమ్మ. కాగా అక్కరలేని ఆడపిల్లను అనుకొన్న నేనే ఆమె మనుగడకు ఆధారమైనాను. అట్లే ఆమె నాకు ఏడుగడ అయినది.

చిరుపిందెలోని వగరుతనం ఎప్పుడు, ఏక్షణాన ఎట్లా వదలిపోతుందో సృష్టికర్త తప్ప తెలియదు. నాలోని కార్పణ్యకోపాలు ఏ విధంగా, ఏ ముహూర్తాన వదలిపోయినాయో నాకు తెలియదు కాని, నా చుట్టూ కట్టుదిట్టము చేసుకున్న సంకుచిత భావపటలి - దివ్యప్రభాద్యుతులకు వెఱచి పారిపోతున్న నల్లని చీకట్లవలె - విచ్చిపోవటం ఆరోజులలో జరిగింది.

సంధ్యాసమయం దాటిపోయి మసక చీకట్లు క్రమ్ముకొంటుండగా ఆవేళ స్కూలు నుంచి అలసటగా వచ్చి ఇంట్లో అడుగు పెడుతున్నాను. పక్కింటి పిన్నిగారితోనే కామోసు అమ్మ అంటున్నది.

'ఈపిల్ల ఈవేళ ఇంత ఆలశ్యమైనా ఎందుకురాలేదో తోచటం లేదమ్మా!' అని.

'స్కూలులో ఏమీటింగో, టీపార్టీయో అయి ఉంటుంది లెండి. ఉత్తినే గాభరా పడుతున్నారు.' పక్కింటి పిన్నిగారిస్వరం.

'ఏమో తల్లీ, ఇప్పుడిదే నాకు పసిపిల్ల అయిపోయింది. క్షణం అదిలేకపోతే ఏమీ తోచదు. ఈ పసిపిల్లకూడా పెద్దవాళ్ళకు మల్లే నన్ను వదిలిపెట్టిపోతే...' అంతే అమ్మకంఠం గద్గదమై మరేమీ మాట్లాడలేకపోయింది.


వాకిట్లో నించుని వింటున్న నా గొంతుక నిండా ఏదో నిండుకు వచ్చింది. ఏదో ఆర్ద్రత, ఏదో అనుబంధం-నన్ను నిలువునా ముంచివేసి పరిపూతం చేసినట్టయింది.

నేను చేసిన చిన్నతప్పుకైనా అమ్మనన్ను దండించింది. నాచేత పనులుకూడా చేయించింది, అది నా శ్రేయస్సుకోసం చేసిన పని కాని ఆమెకు నాపైన శత్రుత్వం ఉన్నదని అనుకోవటం ఎంతభ్రమ! నాలో సరళ స్వభావంకన్న పరుషత్వం ఒకపాలు ఎక్కువ ఉంది. అందుకే అమ్మనూ, చిన్నక్కనూ ఇన్నాళ్లు ద్వేషించాను. ఆడపిల్లలకు ఇంతపరుషత్వంకూడదుసుమా! అమ్మను ఈ అమ్మను—అక్కయ్యలకు మల్లే వదిలిపెట్టి నేను ఎక్కడికీ వెళ్ళనుగాకవెళ్లను- అని నిశ్చయానికి వచ్చాను.

కాలచక్రం గిర్రున తిరుగుతూ నన్ను సంస్కరించినట్లే చిన్నక్కనుకూడా అద్భుతంగా మార్చివేసింది. ఇప్పుడు చుట్టపుచూపుగా అప్పుడప్పుడు వచ్చే చిన్నక్కకు మన్ననా, మర్యాదా అబ్బినాయి! ఆమె ఇదివరకటిమల్లే నాతో గిల్లికజ్జాలు పెట్టుకోవటం లేదు సరికదా, ఎంతో పెద్దమనిషి తరహాగా మాట్లాడుతూ తనముందు నన్ను ఒక్క పసిపిల్లనుగా చేసింది!

ఈ చిన్నక్కా, నేనూ ఈ ఇంట్లోనే పుట్టి పెరిగాము. కాని ఆమె ఇప్పుడు మరొకఇంటి సొత్తయిపోయింది. ఒకచోట

(62-వ పేజీ చూడండి)



# ★ అనుబంధాలు ★

(16-వ పేజీ తరువాయి)

ఆడుతూ పాడుతూ పెరిగేరోజులలో ఇద్దరమూ సన్నిహితులం కాలేకపోయాము. ఇప్పుడైతే సానుభూతి స్నేహభావం కలిగాయి. కాని ఇప్పుడామె మాకు దూరం అయిపోయింది.

'భోజనం చేస్తూ చేస్తూ 'ఇప్పుడు చిన్నక్క ఏం చేస్తుందో అమ్మా!' అని నేననటమూ,

'ఇక్కడ ఉండగా కీచులాట లేకుండా దినం గడిచేదికాదు. అదేమే, దాన్ని అంతలా తలుస్తున్నావు?...' అని ఆశ్చర్యంగా అమ్మ అనటమూ—రోజూ ఇంట్లో పరిపాటి అయిపోయింది.

కానీ కాలచక్రం తన ధర్మం ప్రకారం తిరుగుతూ, అందరు ఆడపిల్లలకూ జీవితంలో ఏదో ఒక రోజున తెచ్చే ఆ మహత్తర క్షణాన్ని నాజీవితంలోకీ తెచ్చింది.

ఆ తెల్లవారుఝామున తెలి తెలి వెలుగుల్లో నేను పుట్టి పెరిగిన ఆ యింటిని, నా చిగురు ప్రాయపు భావోద్వేగాలకూ రాగ విరాగాలకూ ఆలవాలమైన ఆ యింటిని—వదలివెళ్ళే తరుణం వచ్చింది.

ఆరాత్రి చిరువెన్నెలలో ఆరుబయట మంచంవాల్చుకుని పడుకున్నాను. నా మనస్సు ఆవేదనతో, ఒక విచిత్ర అనుభూతిలో విలవిలలాడి పోయింది. ఇట్టి విచిత్రమైన భావసంఘర్షణలు నాకేనా, లేక ప్రతి ఆడపిల్లకూ ఇట్టి సమయంలో సహజమైనవేనా?

నాలో నేను వితర్కించుకుంటూ వుండగా ఆ క్రితం రోజే పురిటికని వచ్చిన చిన్నక్క వచ్చి నా ప్రక్కను కూర్చుని 'ఏవిటే, అంతలా ఆలోచిస్తున్నావు?' అన్నది.

ఏమి ఆలోచిస్తున్నానో ఏమని చెప్పను? ఎలా చెప్పను? నీలాభ్రంలో తళతళ మెరుస్తూన్న చుక్కల అర్థాన్ని ఆలోచిస్తున్నానని చెప్పనా?

నేను సమాధానం చెప్పలేదు. నా నిశ్శబ్దాన్ని అర్థం చేసుకున్న చిన్నక్క 'ఏమి ఆలోచిస్తున్నావని' మళ్ళా నన్ను ప్రశ్నించనూ లేదు. బహుశా తానూ ఈ ఇంటిని తొలిసారిగా వదలిపోయిన సమయం గుర్తు వచ్చింది కాబోలును, నేలవంక చూస్తూ స్తబ్ధంగా కూర్చుండిపోయింది.

'ఏమే చిన్నక్కా, ఒక్కసారి మళ్ళా నాతో జగడమాడవూ? చిన్నప్పుడు ఉత్తినే గిల్లికజ్జాపెట్టుకునే దానివే, అల్లా!' అన్నాను ఉన్నట్లుండి.

చిన్నక్క ఆశ్చర్యంగా నా వంక చూచింది. మరుక్షణంలో ఆమె కళ్ళు నీటితో నిండిపోయాయి. గొంతువరకూ నిండిన గాద్గద్యంతో, కళ్ళను నిండుతున్న బాష్పాలతో అక్కయ్య వంక చూచాను.

'ఏమని పోట్లాడనే, నా కలం తీశావనా నాపు స్తకం అంటుకున్నావనా?' అక్కయ్య నవ్వుతూ అన్నది.

'ఏదైనా సరే! కారణం కూడా వుండాలా ఏమిటి?...' కన్నీళ్ళ మధ్య ఇద్దరకు నవ్వు వచ్చింది.

మా కన్నీళ్ళూ, నవ్వులూ అప్పుడే బయటకు వచ్చిన అమ్మ చూచి 'అదేమే కళ్లల్లో నీళ్ళూ, ఆ నవ్వులూనూ!' అన్నది.

'దీనికి బొత్తిగా చిన్నతనం వదల్లేదే అమ్మా!' అన్నది కళ్ళు తుడుచుకుంటూ చిన్నక్క.

నిజం, నాకు చిన్నతనం వదలనేలేదేమో కాని ఇట్టి భావస్ఫూర్తి, ఇట్టి అనుభూతి, చేదు, తీపి కలిసిన అనుభూతి—ఆ చిన్నతనానికి పర్యాయపదమే అయితే, ఆ చిన్నతనం నాలో కలకాలమూ వుండాలి.

నేలవంక చూస్తూ చిన్నక్కా, నింగి వంక చూస్తూ నేనూ ఆ నిశీథి అర్ధభాగం వరకూ ఆరుబయట మంచంమీద అలానే కూర్చుండిపోయాము. ★





## కళ్లు మూసుకొని

### నే నెప్పుడు సానరాళ్లు కొనను

కళ్లు మూసుకొని సానరాళ్లు కొనడము, లేక చౌక రకమనే తీసుకోడము బుద్ధిహీనమైన నష్టకరమగు పని. ఎటువంటి సానపనికైనా ముఖ్యంగా గమనించవలసిన విషయాలు రెండు — బాండెడ్ సానరాళ్ల విశిష్టత, మితవ్యయంతో మంచి మన్నిక. ఇవేగాక ఇతర విశిష్ట లక్షణాలు కార్బొరండమ్ యూనివర్సల్ సానరాళ్లకున్నాయి.

**సానరాళ్లు:**

సాన రాళ్లు, పదునుపెట్టు రాళ్లు, అరుగదీయు రాళ్లు, మెఱుగుపెట్టు రాళ్లు, గ్రైండింగు కాంపౌండు మొదలగునవి

**కార్బొరండమ్ యూనివర్సల్ లిమిటెడ్,**

హెడ్ ఆఫీసు: 52/53, జహంగీర్ వీధి, మద్రాసు-1.
టెలిఫోన్: 2941 (4 లైన్లు)
కార్ఖానా: తిరువత్తియూరు, మద్రాసు.

పంపకపుదారులు:

మెస్సర్సు: విలియం జాక్స్ & కంపెనీ లిమిటెడ్.
కలకత్తా-1, బొంబాయి-1, మద్రాసు-1, న్యూఢిల్లీ, బెంగుళూరు-1, కాన్పూరు.
ప్రత్యేక రకాలకు మాత్రము
మెసర్సు హెచ్. ఎస్. కాక్స్ & కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ 24, రాంపార్ట్ రో. బొంబాయి.